సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం ၊ 26 ၊ ఆగస్టు ၊ 2024



గణపయ్యా.. బొజ్జ నింపయ్యా.!

వినాయక చవితి వేడుకలు మరో పదిరోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ పండుగ చిరువ్యాపారులు, వివిధ రంగాల కార్మికులు, రైతుల కడుపు నింపుతుంది. -8లో



ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానంటూ మోసం

తనకు రాజకీయంగా మంచి పలుకుబడి ఉందని.. ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి పలువురి వద్ద రూ.కోటికి పైగా వసూలు చేసి పరారయ్యాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.300
రెండోరకం	రూ.140	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 488 మెట్రిక్ టన్నులు





కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సౌకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్.

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టు అమలు చేయాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన సంఘటన దారుణం. ఇలాంటివిపునరావృతం కాకుండా మహిళా వైద్యుల కోసం ఆసుపత్రి వద్ద పోలీసులతో రక్షణ ఏర్పాటు చేయాలి. డ్రస్సింగ్ రూమ్, రెస్ట్ రూములను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్టును వెంటనే అమలు చేయాలి.

- రాధిక, వైద్యాధికారిణి, చిన్నమండెం ప్రభుత్వాసుపత్రి

పటిష్ట భద్రత కల్పించాలి



కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన మృగాలను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి అవసరం ఉంది. వైద్యులు, వైద్య సిబ్బందిపై కొంత మంది దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. భద్రతను పెంచాలి.

–డాక్టర్ రంగలక్ష్మి, పి. కొత్తపల్లె పిహెచ్‌సీ, సిద్దవటం మండలం

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



విధి నిర్వహణలో ఉండే మహిళా డాక్టర్, వైద్య సిబ్బందికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలి. అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మానిటరింగ్ చేయాలి. ఇలా చేయడం వల్ల ఎవరైనా వైద్యులు, సిబ్బందిపై అఘాయిత్యాలకు, దౌర్జన్యాలకు పాల్పడితే వెంటనే పోలీసులు వచ్చి కాపాడేందుకు వీలవుతుంది.

- పాలెం నూర్జహాన్, ఏఎన్‌ఎం, ఆకేపాడు పీహెచ్‌సీ, రాజంపేట మండలం

నిఘాతో పాటు పెట్రోలింగ్ అవసరం



మహిళా డాక్టర్స్, వైద్య విద్యార్థులు పని చేస్తున్న ప్రదేశాలలో, అన్ని సమయాలలో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ వారి నిఘా అవసరం. వారితో పాటు పోలీస్ పెట్రోలింగ్ కూడా ఏర్పాటు చేయడం మరింత రక్షణగా ఉంటుంది.

–ఎం.సురేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రిమ్స్, కడప

న్యూస్‌రీల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక తాత్కాలిక రద్దు

రాయచోటి: ఈ నెల 26వ తేదీ సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కృష్ణాష్టమి సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు



సిద్దేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాజంపేట: తాళ్లపాక శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం టీటీడీ వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, హోమం, లఘుపూర్ణాహుతి జరిపారు.భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో తాళ్లపాక ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

పొట్టి..మహా గట్టి



పుంగనూరు జాతి ఆవు

మదనపల్లె సిటీ: అరుదైన పుంగనూరు జాతికి చెందిన ఈ ఆవు చూసేందుకు పొట్టిగా కనిస్తుంది. మదనపల్లె పట్టణం గోవర్ధనగిరిలోని శ్రీకృష్ణ ఆలయంలో దాతలు పుంగనూరు పొట్టి ఆవులను గోదానం చేశారు.వీటి కోసం ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేశారు. ప్రతి రోజు భక్తులు ఆవులకు పూజలు నిర్వహిస్తున్నారు.

మహిళలను లక్షాధికారి చేయడమే లక్ష్యం



చెక్కులను అందిస్తున్న డీఆర్‌వో సత్యనారాయణ

రాయచోటి టౌన్: స్వయం సహాయ సంఘంలోని ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌వో సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాయచోటిలోని జిల్లా సభాభవనంలో 'ప్రధాన మంత్రి లక్పతి దీది ఫెలిసిటేషన్' ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 762సంఘాలకు రూ.94.58 కోట్ల బ్యాంక్ రుణాలు, రివాల్వింగ్ ఫండ్ చెక్కును అందించారు. అనంతరం వీరబల్లె, చిట్వేల్ మండలాలకు రూ. 20లక్షల సీఐఎఫ్ నిధులు అందించారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్‌- 14, 16 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలలో 300 మందిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను సెప్టెంబరులో 14, 15, 16 తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున యనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనను న్నారు. ఈ పోటీలను వ్యాయామ సంచాలకులు వెంకటసుబ్బయ్య, సునీల్, శివారెడ్డి, ఎర్రన్న, రాఘవేంద్ర, అంకారావు, నాగేశ్వరరావు, బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమద్‌బాష తదితరులు పర్యవేక్షించారు.

పారిశుధ్యం మమ.. విజృంభిస్తున్న దోమ!

▶▶ జ్వరం తగ్గడం లేదు



నా పేరు బరుగు నాగేశ్వరరావు. సంబేపల్లె మండలం, శెట్టిపల్లె గ్రామం.మూడు రోజులుగా రాయచోటి పెద్దాసుపత్రిలో జ్వరానికి వైద్యం చేయించుకుంటున్నాను. రక్త పరీక్షల్లో మలేరియా జ్వరం అని అన్నారు. సూది వేశారు. నాలుగు మందు బిళ్లలు ఇచ్చారు. అయినా జ్వరం తగ్గడం లేదు.

ప్రజలపై జ్వరాలు పంజా విసురుతున్నాయి. అధికారిక లెక్కలు అంతంత మాత్రంగానే చూపుతున్నా అనధికారికంగా మాత్రం వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. వాతావరణ మార్పులతోపాటు పారిశుధ్యం సమస్యలతో జ్వరాలు విస్తరిస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న పలు రకాల జ్వరాలతో జనం ఆస్పత్రుల వైపు పరుగులు తీస్తున్నారు. ప్రధానంగా డెంగీతోపాటు టైఫాయిడ్, వైరల్ ఫీవర్లు, మలేరియా జ్వరాలు ముసురుతున్నాయి.

- పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా చెత్త నిల్వలు
- జిల్లాలో క్రమంగా విస్తరిస్తున్న డెంగీ కేసులు
- జ్వర పీడితులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు

సాక్షి రాయచోటి : కరోనా వైరస్ ప్రభావంతో 2020 నుంచి 2022 వరకు ప్రజలు అట్టుడికిపోయారు. బయటికి రావాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అప్పట్లో జ్వరాల సంఖ్య కూడా పూర్తి స్థాయిలో తగ్గిపోయింది. సీజన్‌లోనూ కరోనా వైరస్ కేసులు తప్ప జ్వరాల ప్రభావం కనిపించకుండా పోయింది. అయితే ప్రస్తుత సీజన్‌లో ఇప్పుడిప్పుడే జలుబు, జ్వరాలు, డెంగీ, టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. జిల్లాలో అనేక రకాల సమస్యలతో ఆస్పత్రుల వైపు జనాలు వస్తుండడంతో ఎక్కడికక్కడ ప్రైవేటు ఆస్పత్రులతోపాటు ప్రభుత్వ వైద్యశాలల్లో ఓపీ సంఖ్య పెరుగుతోంది. విష జ్వరాలు వచ్చిన వారు పట్టణ ప్రాంతాల్లో పెద్దాస్పతులకు వెళుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. రాజంపేట ఏరియా ఆస్పత్రి పరిధిలో ఈనెలలోనే సుమారు 90 వరకు టైఫాయిడ్, రాయచోటి పరిధిలో సుమారు 2400కు పైగా పరీక్షలు నిర్వహించగా, టైఫాయిడ్‌తోపాటు మలేరియా, డెంగీ కేసులు నమోదయ్యాయి. అలాగే మదనపల్లె పెద్దాస్పత్రిలో కూడా ఈనెలలో 20,581 మంది ఆస్పత్రులకు రాగా, అందులో 6385 మందికి రక్తపరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి టైఫాయిడ్ నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇదే వరుసలో డెంగీ



రాయచోటి ప్రభుత్వాసుపత్రిలో మందుల కోసం క్యూలో నిలుచున్న రోగులు

జ్వరాలకు సంబంధించి అధికారిక వివరాలు


సంవత్సరం	మలేరియా	డెంగీ	చికెన్‌గున్యా
2023	18	314	--
2024 (ఇప్పటివరకు)	16	193	06

కూడా పెద్ద ఎత్తున కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. అయితే అధికారికంగా అధికారులు మాత్రం ఎక్కడా డెంగీ కేసుల సంఖ్యపై స్పష్టత ఇవ్వకపోవడం ఆందోళన కలిగించే పరిణామం. అయితే చిన్న పిల్లలు, వృద్ధులు జ్వరాల బారిన పడుతుండడంతో పెద్దాస్పత్రితోపాటు వంద పడకల ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

జ్వరాలతో జరభద్రం

ఈ సీజన్‌లో ఆరు నెలలపాటు జాగ్రత్తగా ఉండకపోతే ఇబ్బందులు తప్పవు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, వైరల్ జ్వరాలు విస్తరిస్తున్నాయి. డెంగీ జ్వరం సోకిన వ్యక్తికి రక్తకణాల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ప్రతిరోజు వందల సంఖ్యలో జ్వరాలతో జనాలు ఆస్పత్రులకు వెళుతున్నారు. ఇంటిలో ఒకరికి వచ్చినా మిగతా వారికి విస్తరించే అవకాశం ఉంటుందని ఆరోగ్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ప్రధానంగా 2023లో జిల్లాలో సుమారు 314 డెంగీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 193 కేసులు నమోదయ్యాయి. ఇక మలేరియా గతేడాది అధికారికంగా ఒక్క కేసు అంటున్నా అనధికారికంగా పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది కూడా పరిస్థితి ఇలాగే కనిపిస్తోంది. ప్రధానంగా ఎక్కడ చూసినా టైఫాయిడ్ కేసులు వందల్లో నమోదవుతున్నాయి. వైరల్ ఫీవర్ల సంఖ్య కూడా అలాగే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు భయపడకుండా ధైర్యంగా వైద్య సేవలు పొందుతూ బలవర్ధక ఆహారంతో తిరిగి ఆరోగ్యవంతంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

కొరవడుతున్న పరిశుభ్రత: జిల్లాలో పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా అపరిశుభ్రత తాండవిస్తోంది. జిల్లాలోని ప్రధాన పట్టణాలైన మదనపల్లె, రాయచోటి, రాజంపేట ప్రాంతాలలో మురికి కాలువలపై బండలు లేకపోవడం, ఎక్కడబడితే అక్కడ మురుగు నిల్వలతో దోమల వ్యాప్తి పెరుగుతోంది. అలాగే పట్టణాలతోపాటు పల్లెల్లోనూ పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. చెత్తాచెదారాలు ఎక్కడపడితే అక్కడ పేరుకుపోతుండడంతో అపరిశుభ్రత కారణంగా జ్వరాలు విస్తరిస్తున్నాయి. ఈ సీజన్‌లోనైనా మునిసిపాలిటీలు, మేజర్, మైనర్ పంచాయతీల్లోని మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లడం ద్వారా కొంతమేర వ్యాధులను అరికట్టేందుకు అవకాశం ఉంటుంది. ఉన్నతాధికారులు ఈ దిశగా ఆలోచనచేయాలని ప్రజలు కోరుతున్నారు. దోమల నియంత్రణకు పట్టణాల్లో ఫాగింగ్ చేపట్టాలని స్థానికులు విన్నవిస్తున్నారు.



డెంగీ లక్షణాలు

మదనపల్లె సిటీ: డెంగీ వ్యాధి లక్షణాలు పలు రకాలుగా ఉంటాయి. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కంటి రెప్పల కదికలు తగ్గడం, కదిలించినప్పుడు భరించలేని నొప్పి, ఒళ్లు నొప్పులతో కూడిన జ్వరం, చలి జ్వరం, కండరాల నొప్పులు, ఒక్కోమారు శరీరంలోని వివిధ రంధ్రాల ద్వారా రక్తస్రావం జరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. పరీక్షల్లో డెంగ్యూ పాజిటివ్ అని తెలితే రక్తనమూనాను మదనపల్లె జిల్లా ఆస్పత్రికిలోని మైక్రో బయాలజీ సెంటర్‌కు పంపుతారు. అక్కడ మాక్ ఎలిశా టెస్టు నిర్వహించి వ్యాధి నిర్ధారిస్తారు.

- జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 49
- విలేజ్ హెల్త్ క్లినిక్‌లు: 375
- జిల్లా ఆస్పత్రి: 01
- 100 పడకల ఆస్పత్రులు: 03
- ఏరియా ఆస్పత్రులు: 02
- అర్బన్ హెల్త్ సెంటర్లు: 11

తగిన పరీక్షలు చేస్తున్నాం



మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి జ్వర బాధితులు సర్వజన బోధన ఆసుపత్రికి వస్తుంటారు.వీరికి రక్త పరీక్షలు చేయిస్తున్నాం. వ్యాధి నిర్ధారణ జరిగిన తర్వాత అవసరమైన చికిత్సలు అందిస్తున్నాం. మూడు రోజులకు పైగా జ్వరంతో బాధపడుతున్న వారికి డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా తదితర పరీక్షలు నిర్వహిస్తున్నాం.

– ప్రసాదరాజు, ఆర్‌ఎంఓ, మదనపల్లె

అన్ని చర్యలు చేపడుతున్నాం



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.వీటిని అరికట్టడానికి అన్ని చర్యలు చేపడుతున్నాం.పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలి. అలాగే కాచి వడబోసిన మంచినీటిని తీసుకోవాలి. ఏ మాత్రం అలసట అనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

– డేవిడ్ సుకుమార్, సూపరింటెండెంట్, రాయచోటి ఆసుపత్రి

◆ చెత్తగుంట.. కదలదంట



మదనపల్లె: తారకరామ థియేటర్ సమీపంలో బాహుదాకాలువలో పేరుకుపోయిన చెత్త నిల్వలు

కలమల్లకు కొత్త వెలుగు

- తెలుగు శాసనాన్ని పరిశీలించిన కలెక్టర్ శివశంకర్
- ఈ నెల 29న కలమల్లలో తెలుగుభాష దినోత్సవం



కలమల్లలో ఉన్న తొలి తెలుగు శాసనం



కలమల్ల గ్రామంలో ఉన్న తెలుగు శాసనాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

ఎర్రగుంట్ల/కడప కల్చరల్: వైఎస్‌ఆర్ జిల్లాలో తొలి తెలుగు శాసనం లభించిన కలమల్లకు కొత్త వెలుగు రానుంది. ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ఈ శాసనం ఉంది. క్రీ.శ 575 లో రేనాటి చోళరాజు ధనుంజయ శర్మ వేయించిన తొలి తెలుగు శాసనమిది. ప్రాచీన లిపి ఆధారంగా భారతీయ పురావస్తు శాఖ ప్రప్రథమ తెలుగు శాసనంగా దీనిని అంగీకరించింది. తొలి తెలుగు శిలా శాసనం విశిష్టతను భావి తరాలకు తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఐదవ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలోనూ దీని గురించి పొందుపరిచింది. ఇంతటి గొప్ప చరిత్ర కల్గిన శాసనాన్ని అందరూ తిలకించే విధంగా తమ గ్రామంలోని దేవాలయాన్ని ఆకర్షణీయమైన మందిరంగా తీర్చిదిద్ది శాసనానికి భద్రతకు మినీ మ్యూజియంను ఏర్పాటు చేసి భద్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక ఏర్పాట్ల పరిశీలన

తెలుగుభాష దినోత్సవాన్ని ఒక పండుగలాగా నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలమల్ల గ్రామంలో ఉత్సవాలు జరపనున్నట్లు ఇదివరకే వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం కలమల్ల గ్రామంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉన్న తెలుగు శాసనాన్ని ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఎక్కడైతే మొదటి తెలుగు శాసనం ఉందో అక్కడే తెలుగుభాష దినోత్సవం నిర్వహించాలనుకున్నాని వెల్లడించారు. కలమల్లలో తెలుగు భాష దినోత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యా, పంచాయతీరాజ్, ఎండోమెంట్, ఇంటాక్ సహకారంతో పెద్ద ఎత్తున తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నాటక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, రచయితలకు సన్మానం వంటివి ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

ఇక ఆరు రోజుల పరీక్ష

- ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షను సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ టెస్టుగా మార్పు
- ఈనెల 27 నుంచి పరీక్షలు
- షెడ్యూలు విడుదల చేసిన విద్యాశాఖ



పాఠశాలలో విద్యార్థులు

మదనపల్లె సిటీ: పాఠశాల స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షల పేరును విద్యాశాఖ మార్పు చేసింది. ఇంతవరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ)గా ఉన్న యూనిట్ టెస్టులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ (ఎస్‌ఏఎం)గా పేరు మార్చుతూ ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. ఏడాదికి మూడు సార్లు నిర్వహించే యూనిట్ టెస్టులను ఇప్పటిదాకా రోజుకు రెండు పరీక్షల చొప్పున నిర్వహించేవారు. తాజా ఆదేశాల మేరకు ఇక నుంచి ఈ ఎస్‌ఏఎంలు ప్రతి రోజు ఒక్కో సబ్జెక్టు వంతున ఆరు రోజులు కొనసాగిస్తారు. షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్షలు ఈ ఈనెల 27వతేదీ నుంచి వచ్చే నెల 2వతేదీ వరకు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేటు మినహా అన్ని ప్రభుత్వ అనుబంధ పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ (డీసీఈబీ) నుంచి ప్రశ్నపత్రాలు సరఫరా కానున్నాయి.

మార్కుల నమూనాలో మార్పులేదు

యూనిట్ పరీక్షల స్థానంలో ఇంత వరకు నిర్వహించే ఫార్మేటివ్ పరీక్షల స్థానంలో 20 మార్కులకు మాత్రమే ఉండడంతో ఉదయం,మధ్నాహ్నం కలిపి రెండేసి పరీక్షల చొప్పున నిర్వహించి మూడు రోజుల్లో పూర్తి చేసే వారు. తాజా మార్గదర్శాల ప్రకారం ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రోజు చొప్పున 6 రోజల పాటు పరీక్ష జరపనున్నారు. దీని వల్ల ఏడాదిలో సిలబస్ పూర్తి చేయడానికి సమయం చాలదని, దీని ప్రభావం ఫైనల్ పరీక్షపై చూపుతుందని ఉపాధ్యాయవర్గాలు వాపోతున్నాయి నెలవారీ సిలబస్‌లో 3 రోజులు కుదించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

పరీక్ష షెడ్యూలు ఇదీ: ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 వరకు పరీక్ష నిర్వహిస్తారు. 28న తెలుగు, 30న ఇంగ్లీష్, 31న గణితం, సెప్టెంబర్ 2న పరిసరాల విజ్ఞాన పరీక్షలు ఉంటాయి. ఉన్నత తరగతులకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 27న ఓఎస్‌ఎస్‌సీ, 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లీషు, 2న గణితం, 3న జనరల్ సైన్సు, 4న సోషియల్ సబ్జెక్టులపై పరీక్షలు ఉంటాయి.

- జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు: 2,201
- ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు : 43.947 మంది
- ప్రాథమికోన్నత పాఠశాలలో: 11,653 మంది
- ఉన్నత పాఠశాలలో : 80,864 మంది



టోఫెల్ పరీక్ష లేనట్టే

గత నెల 15న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన 2024–25 అకడమిక్ క్యాలెండర్‌లో టోఫెల్ తరగతుల నిర్వహణకు ఎలాంటి పీరియడ్స్ కేటాయించలేదు. గత ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి వచ్చే ఏడాది జులై వరకు టోఫెల్ తరగతులు పీరియడ్స్ నిర్వహించాలి. ఆ మేరకు అకడమిక్ క్యాలెండర్‌లో కేటాయించాలి. అయితే క్యాలెండర్‌లో లేకపోవడంతో ఈ ఏడాది కూటమి ప్రభుత్వం టోఫెల్ పరీక్షకు మంగళం పాడినట్లే కనిపిస్తోంది.

క్లుప్తంగా

పాము కాటుతో మహిళ మృతి

మదనపల్లె : పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. చీకిల బైలు పంచాయతీ జమ్మికుంటపల్లి కు చెందిన రాజశేఖర్ భార్య కవిత(33) పొలం వద్ద పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకోగా గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


ప్రకాష్ రెడ్డి (ఫైల్)

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ముదివేడు పోలీసులు తెలిపారు. బి.కొత్తకోట మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న కృష్ణారెడ్డి కుమారుడు ప్రకాష్ రెడ్డి (48), ఈనెల 21వ తేదీన వివాహ కార్యక్రమానికి పుంగనూరుకు వెళ్లి, ద్విచక్ర వాహనంలో తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలోని మదనపల్లె చేనేత నగర్ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడి ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడ రమాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహానికి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రెండు బైకులు ఢీ

వీరబల్లి : మండలంలోని ఓదివీడు పంచాయతీ, ఎర్రంరాజుగారిపల్లె వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. శనివారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో సానిపాయి నుంచి రాజు, నాగరాజు రాయచోటికి ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. అలాగే రాయచోటి నుంచి ఎర్రంరాజుగారిపల్లికి వస్తున్న సలీం వాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు

మండలంలోని సానిపాయి పంచాయతీ, జింక దళితవాడ గ్రామానికి చెందిన దూల రాణి అనే మహిళ అదే గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తిపై ఫిర్యాదు చేసింది. రానిపట్ల వెంకట రమణ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడని, అలాగే దుర్భాషలాడాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఎస్‌ఐ మోహన్ నాయక్ తెలిపారు.

పోలీసుల అదుపులో యువకులు

రాజంపేట:పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న పద్మప్రియ కల్యాణమండపం సమీపంలోఆదివారం రాత్రి గంజాయి తాగుతున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజంపేట డీఎస్పీ సుధాకర్ బాధ్యతలు తీసుకున్న రెండురోజుల్లోనే గంజాయిపై ఉక్కుపాదం మోపారు. ఐదుగురిలో ముగ్గురు పోలీసులకు చిక్కారు. మరో ఇద్దరు పరారీ అయ్యారు.

కోల్‌కతా ఘటన అమానుషం



ప్రజలు ప్రాణాలను కాపాడే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కతా ఘటన అమానుషం . నిందితులనే వెంటనే కఠినంగా శిక్షించాలి. మహిళా డాక్టర్లు, ఆరోగ్యసిబ్బంది రాత్రిపూట విధులు నిర్వర్తించే సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం మత్తులో ఉండే వారిని, ఇతరులను అనుమతించకుండా సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి.

-సునీల్ కుమార్ నాయక్, వైద్యుడు, సంబేపల్లె మండలం దేవపట్ల పీహెచ్‌సీ



మనోధైర్యం దెబ్బతింటోంది



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం సంఘటన చాలా బాధాకరం. ఇలాంటి సంఘటనలతో వైద్యసిబ్బంది మనోధైర్యం దెబ్బతింటోంది. ఆస్పత్రుల్లో భద్రతా పరమైన చర్యలు చేపట్టి ప్రతి ఒక్కరికి అవగాహన పెంచాలి.

-ఉమామహేశ్వరిదేవి, ఏఎన్‌ఎం, మైసూరావారిపల్లి సచివాలయం, రైల్వేకోడూరు

పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి



ప్రభుత్వ ఆస్పత్రులలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి. వాచ్‌మెన్ 24 గంటలు ఉండేలా చూడాలి. అలాగే అన్ని విభాగాలలో సీసీ కెమెరాలు అమర్చాలి. అన్ని సమయాల్లో వైద్య సేవలు అందించే మాకు రక్షణ లేక పోవడం బాధాకరం. ఇలాంటి వారిపై చర్యలు తీసుకొంటే ఇతరులు మర్యాదగా ప్రవర్తిస్తారు.

-నాగిశెట్టి రాధాదేవి, స్టాఫ్ నర్సు, అనంతరాజుపేట పీహెచ్‌సీ, రైల్వేకోడూరు

గణపయ్యా.. బొజ్జ నింపయ్యా.!

- మరో పది రోజుల్లో ప్రారంభం కానున్న చవితి వేడుకలు
- ఉపాధిపై చిరువ్యాపారులు.. వివిధ రంగాల కార్మికుల ఆశలు

రాజంపేట టౌన్ : బొజ్జగణపయ్య పండుగ అంటే భక్తి భావం, సందడైన వాతావరణమే కాదు. అనేక మంది బొజ్జనింపే పండుగ. హిందువులకు పెద్ద పండుగ సంక్రాంతి. ఇది ప్రధానంగా దుస్తులు, నిత్యావసర సరుకుల వ్యాపారులకు ఆదాయాన్ని ఇస్తుంది. అయితే వినాయక చవితి పండుగ చిరు వ్యాపారులు, వివిధ రంగాల కార్మికులు, రైతుల కడుపు నింపుతుంది. వినాయక చవితి ప్రారంభానికి ముందు నుంచే అనేక మందికి ఉపాధి దొరుకుతుంది. అందువల్ల ఈ ఉత్సవాలపై అనేక మంది ఆశలు పెట్టుకుంటారు. మరో పది రోజుల్లో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో చవితి వేడుకల సందడి ప్రారంభం కానుంది.

కళాకారులకు పండగే..

సెల్‌ఫోన్ అందుబాటులోకి వచ్చాక కాలక్షేపానికి, వినోదానికి కొదవలేదనే చెప్పాలి. అందువల్ల అనేక కళలు కూడా అంతరించిపోయాయి. అయితే వినాయక చవితి సందర్భంగా గాన, నృత్య, మిమిక్రి, మ్యాజిక్‌షో, ఆర్కెస్ట్రా, సన్నాయివాయిద్యం, డ్రమ్స్ వాయించే కళాకారులకు చేతినిండా పని లభించి కనీసం ఓ రెండు నెలల పాటు వారి కుటుంబాల పోషణ సాఫీగా సాగిపోతుంది. జిల్లాలో వందలాది మంది కళాకారులు వివిధ కళలను నమ్ముకొని జీవిస్తున్నారు. అలాంటి వారికి వినాయక చవితి నిజంగా కడుపునింపే పండుగ అనే చెప్పాలి. కాగా చవితి ఉత్సవాలు జరిగినన్ని రోజులు పురోహితులకు కూడా ఉపాధి లభిస్తుంది.

చిరు వ్యాపారులకు, రైతులకు సైతం..

కొన్ని రోజుల పాటైనా ఇబ్బందులు లేకుండా చిరు వ్యాపారులు, రైతుల కడుపు నింపేందుకు వినాయక చవితి వేడుకలు ఎంతగానో దోహదపడతాయి. చవితి వేడుకలు జరిగినన్ని రోజులు ప్రధానంగా పూలు, పండ్ల వ్యాపారం జోరుగా సాగుతుంది. అందువల్ల వ్యాపారులకు, రైతులకు కొంతమేర ఆదాయం సమకూరి వారి కుటుంబ పోషణ సాఫీగా సాగుతుంది.

కార్మికులకు ఉపాధి..

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అసంఘటిత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. ఇందులో ఎలక్ట్రీషియన్, దినసరి కూలీలు, ట్రాలీ ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు చేతినిండా పని దొరుకుతుంది. అందువల్ల చవితి ఉత్సవాలు జరిగినన్ని రోజులు అసంఘటిత కార్మికుల ఉపాధికి ఢోకా ఉండదు.



ఉపాధికి కొదవవుండదు



పురోహితులకు ఏడాదిలో అనేక నెలలు పని ఉండదు. కొన్ని రోజుల పాటు పురోహితులందరికి ఉపాధి దొరికే పండుగ ఏదైనా ఉంది అంటే అది వినాయక చవితే అని చెప్పాలి. ఒక పురోహితులకే కాదు అనేక మందికి వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఉపాధి లభిస్తుండటం సంతోషదాయకమైన విషయం.

జనార్దన్ స్వామి, పురోహితుడు, రాజంపేట

వ్యాపారం జోరుగా సాగుతుంది



వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభానికి నాలుగైదు రోజుల నుంచి వ్యాపారం జోరుగా సాగుతుంది. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేవారు పూజా కార్యక్రమాలకు విశేషంగా ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ కారణంగా వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

శివమణి, పూజా సామగ్రి వ్యాపారి, రాజంపేట

చేతినిండా పని ఉంటుంది



ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. చాలా మంది ఉత్సవ కమిటీ వాళ్లు మండపాలను విద్యుత్ దీపాలతో చూపరులను విశేషంగా ఆకట్టుకునేలా తీర్చిదిద్దేందుకు ఇష్టపడుతున్నారు. అందువల్ల దాదాపు పదిరోజులకు పైగా ఎలక్ట్రీషియన్లందరికి చేతినిండా పని ఉంటుంది.

గణేష్, ఎలక్ట్రీషియన్, రాజంపేట

మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని మాదిగల సమస్యల పరిష్కారంపై తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీఓ సభా భవనంలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ఎలాంటి భంగం కలగకుండా మాదిగలలోని ఉపకులాలకు సైతం ఉద్యోగాలు దక్కేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తితో మాదిగలంతా ముందుకు సాగాలన్నారు. పట్టణంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నేత రామాంజనేయులు, జిల్లా గౌరవాధ్యక్షుడు వంగిమళ్ల రమణ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షుడు హరిబాబు, ఎమ్మార్పీఎస్ పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

కొయ్యల మండీలో అగ్నిప్రమాదం

వాల్మీకిపురం : పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న కొయ్యల మండీలో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకొంది. పట్టణానికి చెందిన సయ్యద్‌బాషా తిరుపతి రోడ్డులోని పెట్రోల్ బంక్ ఎదురుగా కొయ్యల మండీ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కొయ్యల మిషన్‌తో పాటు విలువైన కొయ్యలు, ద్విచక్రవాహనం కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిప్రమాదాన్ని నివారించినా ప్రయోజనం లేకపోయింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.10 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు సయ్యద్ బాషా వాపోయారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.


అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న కొయ్యల మండీ

వేరుశనగ పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

గాలివీడు : వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నష్టపోయిన వేరుశనగ పంట రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి కోరారు. ఆదివారం గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన ఎగువగొట్టివీడు, చీమల చెరువుపల్లి, తూముకుంట గ్రామాల్లో పలు వివాహ, పరామర్శ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను, ఎండిపోయిన వేరుశనగ పంటల గురించి ప్రజలు, రైతులు మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి, మండల కన్వీనర్ మిట్టపల్లి యదుభూషణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆవుల నాగభూషణ్ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మా అమరనాథ్ రెడ్డి, పలువురు సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


పార్టీ నాయకులతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

విష ద్రావణం తాగిన మహిళ మృతి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని కర్చుకుంటపల్లి గ్రామానికి చెందిన ఆవిలి గుర్రమ్మ (45) అనే మహిళ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ నరేష్ బాబు తెలిపారు. గుర్రమ్మ చిలంకూరు గ్రామంలో ఉన్న ఐసీఎల్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ కార్మికురాలిగా పనిచేసేది. ఈనెల 24వ తేదీన డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం 12 గంటలకు లంచ్ బ్రేక్‌లో బ్యాంకులో పని ఉందని చెప్పి కర్చుకుంటపల్లికి వచ్చింది. తర్వాత ఏదో ద్రావణం తాగి వాంతికి చేస్తుండగా చుట్టు పక్కల వారు గమనించి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అరటి పంట దగ్ధం

కాశినాయన : మండలంలోని కె.ఎస్.కొట్టాల గ్రామానికి చెందిన లెక్కల బాలసుబ్బారెడ్డి అనే రైతుకు చెందిన 8 ఎకరాల్లోని అరటిపంట ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయింది. దీంతో పాటు డ్రిప్‌వైర్లు, పైపులు కాలిపోవడంతో దాదాపు రూ.15 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. పోరుమామిళ్ల ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

రైతు భరోసా కేంద్రం కూల్చివేత


నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని దృశ్యం

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని శనివారం రాత్రి జేసీబీతో కూల్చివేశారు. సురేష్‌కు చెందిన ఈ స్థలాన్ని గతంలో కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నారు. ఈ పత్రాల ఆధారంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో సుమారు రూ.15 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం రూ.3లక్షల వరకు పనులు పూర్తి చేశారు. గ్రామంలోని గ్రామ సచివాలయం పక్కనే రైతు భరోసా కేంద్రం నిర్మాణంలో ఉంది. కాగా పిల్లర్స్ వరకు నిర్మించిన నిర్మాణాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఎవరు గొడవలకు దిగవద్దని పోలీసులు హెచ్చరించారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు సమస్యను పరిశీలించారు. ఫ్యాక్షన్ సీఐ భాస్కర్‌రెడ్డి సంఘటనపై విచారించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండల పరిధిలోని ఎర్రగుంట్ల-తిరుపతి బైపాస్‌రోడ్డులో బచ్చుంపల్లి వద్ద రోడ్డు దాటుతున్న బద్వేలు నజీర్ (27)ను గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. మృతుడిది వల్లూరు మండలం కాగా, ఇతను కడపలోని అప్సర సర్కిల్‌లో నివాసముంటుండేవాడు. సొంత పనుల నిమిత్తం బచ్చుంపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

డివైడర్‌ను ఢీకొని..

పులివెందుల రూరల్: పట్టణంలోని కదిరి ప్రధాన రహదారిలో ఆదివారం డివైడర్‌ను ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల వైపు నుంచి కదిరి రోడ్డు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం కదిరి ప్రధాన రహదారిలో డివైడర్‌ను ఢీకొంది. దీంతో వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

మత విద్వేష వ్యాఖ్యలకు నిరసన

కడప కల్చరల్ : మహమ్మద్ ప్రవక్తపై మహారాష్ట్రకు చెందిన మహరాజ్ అనే వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం కడప నగరానికి చెందిన ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ముస్లిం సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. మహా ప్రవక్త మహ్మద్ కీర్తి, ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపిత మహారాజ్ మహారాష్ట్రలో చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇస్లాంకు వ్యతిరేకమైనవని, ముస్లింల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని ఆరోపించారు. ఆయనపై కేసు నమోదు చేయాలని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ విద్వేష పూరితమైన వ్యాఖ్యలకు కారకుడైన వ్యక్తిపై ఆ ప్రాంత ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, మైనార్టీ నేతలు అమీర్ బాబు, ఆరీఫుల్లా, బాబుభాయి, నజీర్ అహ్మద్, ముస్లిం మత గురువులు మహమ్మద్ అలీ బాగ్దాది, అబ్దుల్ రెహమాన్, జాకీర్ మౌలానా అబ్దుల్, అబ్దుల్ జబ్బార్, షామీర్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీగా ఏడురోడ్ల కూడలికి చేరుకుంటున్న ముస్లింలు

ఇళ్ల స్థలాలు ఇప్పిస్తానంటూ ఘరానామోసం

- రూ.కోటికి పైగా వసూలు చేసుకుని పరార్
- మూడేళ్లుగా బాధితుల ఎదురు చూపులు
- ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు


నిందితుడు మంజునాథ (ఫైల్)

మదనపల్లె : తనకు రాజకీయంగా మంచి పలుకుబడి ఉందని.. ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి పలువురి వద్ద రూ.కోటికి పైగా వసూలు చేసి పరారయ్యాడు. మోసపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు.. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కోళ్ల బైలు పంచాయతీ భయ్యారెడ్డి కాలనీలో శాంతమ్మ.. కుమార్తె దివ్య, కుమారుడు శ్రీనివాసులతో కలిసి టైలరింగ్ చేస్తూ జీవిస్తోంది. ఆ ప్రాంతంలో ఉన్న అధిక శాతం మంది చేనేత కార్మికులు ఆమెకు బంధువులే. ఈ క్రమంలో 2021లో సత్యసాయి జిల్లా కదిరి మండలం ఇనగలూరుకు చెందిన మంజునాథ.. మదనపల్లెకు వచ్చి భయ్యారెడ్డి కాలనీలో దివ్యతో సహజీవనం చేస్తున్నాడు. బీటెక్ వరకు చదివిన మంజునాథ.. తనకు రాజకీయంగా పలుకుబడి ఉందని, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి అందరికీ ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. అతని మాయ మాటలు నమ్మిన శాంతమ్మ బంధువులు, పరిసర ప్రాంత ప్రజలు 2021 డిసెంబర్‌లో ఇళ్ల స్థలాల కోసం ఒక్కొక్కరు రూ.2 లక్షల నుంచి 5 లక్షల వరకూ చెల్లించారు. అందరి వద్ద విడతల వారీగా దాదాపు రూ.1 కోటికిపైనే వసూలు చేశాడు. ఇళ్ల పట్టాల మంజూరుకు అవసరమైన ప్రక్రియ జరుగుతోందంటూ ఏడాది కాలంగా నమ్మిస్తూ వచ్చాడు. ఆ తర్వాత అతనిపై నమ్మకం కోల్పోయిన స్థానికులు తమ నగదు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో పరారయ్యాడు. దీనిపై బాధితులు గతంలో రెండు సార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఆదివారం బాధితులంతా కలిసి మళ్లీ పోలీసులను ఆశ్రయించారు.


తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న బాధితులు

ఆధిక్యంలో చిత్తూరు జట్టు


93 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ నిఖిత్


83 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ విజయ్‌రామిరెడ్డి


9 వికెట్లు తీసిన కర్నూలు బౌలర్ ఇస్మాయిల్


4 వికెట్లు తీసిన కడప బౌలర్ ఆదిల్ హుస్సేన్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 395 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 102.1 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 450 పరుగులు చేసింది. జట్టులోని నిఖిత్ గౌడ్ 93 పరుగులు చేశాడు. కడప బౌలర్ ఆదిల్ హుస్సేన్ 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 64.5 ఓవర్లలో 245 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని విజయ్‌రామిరెడ్డి 83 పరుగులు చేశాడు. శేషాద్రినాయుడు 25 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు రెడ్డిప్రకాష్ 5, డానియల్ దాస్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 13 పరుగులు చేసింది. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 218 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

హోరాహోరీగా కర్నూలు, నెల్లూరు మ్యాచ్..

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 87 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 35.2 ఓవర్లలో 174 పరుగుల వద్ద ఆలౌట్ అయింది.

జట్టులోని భార్గవ్ 52 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ ఇస్మాయిల్ 9 వికెట్లతో రాణించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 48.1 ఓవర్లలో 237 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మనోజ్‌రాజు 86 పరుగులు, ఇస్మాయిల్ 51 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు బౌలర్ సుతేజ్‌రెడ్డి 4 వికెట్లు తీశాడు. 323 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులు చేసింది. జట్టులోని అబ్బాస్ 31, సోహన్ వర్మ 15 పరుగులు చేశారు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది. కాగా కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

బాలరాజు సేవలకు ఫలితమే ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష పదవి

వైద్యుల ఆత్మీయ సమ్మేళనలో ఐఎంఏ జాతీయ, రాష్ట్ర నేతలు

రాజంపేట : డాక్టర్ సంగరాజు బాలరాజు ఐఎంఏ తరపున నిరంతరంగా అందించిన సేవలకు ఫలితమే ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నిక కావడమని పలువురు ఐఎంఏ జాతీయ ,రాష్ట్ర నేతలు కొనియాడారు. నెల్లూరు రహదారిలోని సంగరాజు కల్యాణ మండపంలో 2025–2026కు గాను రాష్ట్ర అధ్యక్షునిగా డాక్టర్ బాలరాజు ఎన్నికైన సందర్భంగా ఆదివారం రాజంపేట ఐఎంఏ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో ఐఎంఏ జాతీయ నేతలు డాక్టర్ శ్రీహరి, జి.రవికృష్ణ, రాష్ట్ర నేతలు డాక్టర్ త్యాగరాజారెడ్డి, హరికుమార్‌రెడ్డి, బాలమద్దయ్య, విజయభాస్కర్‌రెడ్డి, అనిల్, ఏవీ సుబ్బారెడ్డి, సుధాకర్, సీనియర్ మహిళా వైద్యులు డాక్టర్ జయమ్మ, కామేశ్వరమ్మ, శాంతకుమారి, విజయలక్ష్మీ, జయగౌరి, రాజంపేట ఐఎంఏ నాయకులు చలమయ్య, శ్రీహరి, ధనశ్రీ, నవీన్, చట్టెని అనిల్‌తో పాటు అనంతపురం, కడప, రాయచోటి, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.


ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజును సన్మానిస్తున్న ఐఎంఏ జాతీయ,రాష్ట్ర నేతలు

ఐఎంఏ బలోపేతానికి కృషిచేస్తా: రాష్ట్ర అధ్యక్షుడు సంగరాజు బాలరాజు

రాష్ట్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బలోపేతానికి తన వంతుగా బాధ్యతగా కృషి చేస్తానని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు సంగరాజు బాలరాజు అన్నారు. వైద్యుల సంక్షేమానికి తీసుకోవాల్సిన అవసరమైన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామన్నారు.

వైఎస్సార్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఎన్నిక

వేంపల్లె : వైఎస్సార్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌బీ రవికుమార్, కార్యదర్శిగా స్టాలిన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో టెన్నికాయిట్ క్రీడ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. జిల్లా క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తర్ఫీదు ఇస్తామన్నారు. ఈ ఎన్నికకు అన్నమయ్య జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మంజు పరిశీలకుడిగా వ్యవహరించారు.


రవికుమార్


స్టాలిన్

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు పంప్ బాయ్స్ కావలెను. న్యూ RTC బస్టాండ్, కడప, సంప్రదించండి: 9705826592.

■ CBSE School Rajampet needs Principal vice principal Hostel Incharges, Wardens KG Teachers. Free food accommadation. 9100190500

■ కడప నగరంలో రాత్రి పూట పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ: 9 గంటలు, జీతం: రూ. 10,000, రాజా ప్రవీణ్, సెల్: 799 766 1292.

■ హౌస్ కీపింగ్ స్టాఫ్(జీ:19,400),సె.గార్డ్స్(జీ: 18,000,అన్నిమండలాల్లో)టెంపుల్ సె.గార్డ్ (జీ: 13,000),ITఐటీషియన్స్(జీ:16,500) అన్ని రకాల ప్రభుత్వబెట్ సోర్సింగ్ ఉద్యోగాలకు: 6897909097.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. అర్హత: 10th-డిగ్రీ, శాలరీ 20k-30k మీ ఇంటి వద్దనుండి వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692

■ ప్రముఖ ఎయిర్ పోర్ట్‌లో పని చేయటానికి కార్గో సూపర్ వైజర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, క్యాబ్‌డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. జీతం:28000 నుంచి 34000 రూం+భోజనంఫ్రీ.Ph: 9133671684

■ హరేకృష్ణ హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899

■ కస్టమ్లిష్ట్ కారుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. ఫోన్: 7995984445

SERIVCES

PASSPORT MISSING

■ నాపాస్‌పోర్టు నెంబరు P7521362, షేక్ అబ్దుల్ తండ్రి షేక్ జమాల్ వల్లి, డో.నెం. 3/70-42, సాయి నగర్, గోపవరం, ప్రొద్దుటూరు, పోస్ట్ & మండలం, వైయస్ఆర్ కడప జిల్లా, A.P-516360, గోపవరం నుండి పాత బస్టాండ్‌కు బైక్‌లో వెళుతుండగా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది దొరికినవారు తెలుపగలరు. సెల్: 9014972268.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి పరిశీలించుకోవాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారుల ద్వారా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.